సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం ၊ 8 ၊ అక్టోబర్ ၊ 2025



పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, శ్రీశైలం జలాశయాలకు మంగళవారం ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది.

-8లో ▸



తడిసిన మొక్కజొన్న

బాదేపల్లి మార్కెట్‌యార్డులో మంగళవారం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి మొక్కజొన్న తడిసి ముద్దయ్యింది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం

33.3 /21.5

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఆహ్లాదంగా ఉంటుంది. జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టంపై అవగాహన



పాలమూరు: మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు ఏదైనా సమస్యలు వస్తే మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం–2017ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పలు రకాల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల చట్టం –2016తో ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు, మేధో దివ్యాంగులు, మహిళల రక్షణ గృహాలను వారి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజా, మెడికల్ ఆఫీసర్ నరేష్‌చంద్ర ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ త్రైక్వాండో ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో బుధవారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల తైక్వాండో బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల బాలబాలికలు పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్, నాలుగు ఎలిజిబిలిటి ఫారాలు, అండర్–19 విభాగం వారు పదోతరగతి మెమో, బోనఫైడ్, ఆధార్ జిరాక్స్, నాలుగు ఎలిజిబిలిటి ఫారాలతో ఉదయం 9 గంటలకు సురేందర్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పీయూలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ –1, 5, 7 శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పరిశుభ్రత పాటించడం వల్ల కలిగే లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పీయూను గ్రీన్ క్యాంపస్‌గా మార్చేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో పాల్గొనడం వల్ల విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, ప్రోగ్రాం అధికారి రవికుమార్, శివకుమార్‌సింగ్, జ్ఞానేశ్వర్, వెంకటేశ్, పీడీ శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

కోర్టులో చీటింగ్‌కు పాల్పడిన అధికారి

- విచారణ అనంతరం 14 రోజుల రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: కోర్టులో పని చేసే ఉద్యోగి తన విధుల దుర్వినియోగానికి పాల్పడి ఫోర్జరీతో పాటు చీటింగ్ చేసిన కేసులో టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్.శ్రీనివాసులు 2018 నుంచి 2020 మధ్య కాలంలో తన విధులను దుర్వినియోగానికి పాల్పడుతూ కక్షిదారులకు విడుదల చేయాల్సిన డబ్బుల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు తేలింది. అలాగే సీనియర్ సివిల్ జడ్జి సంతకం ఫోర్జరీ చేయడం, చీటింగ్ చేశారు. దీంతో అతని విధుల నుంచి తొలగించడంతో పాటు మే 21న కోర్టు నుంచి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేసి శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

హంసధాన్యం @ రూ.1,789

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం హంసధాన్యం క్వింటాల్ రూ. 1,789 ధర పలికింది. ప్రస్తుతం సీజన్ లేకపోవడంతో కేవలం 200 బస్తాల హంస ధాన్యం మాత్రమే అమ్మకానికి వచ్చింది. బుధవారం మార్కెట్ యార్డులో బహిరంగ వేలం ద్వారా ఉల్లి కొనుగోళ్లు చేపట్టనున్నారు. అయితే కొన్ని వారాలుగా ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. ఈ వారం ధరలు పెరుగుతాయా లేదా అనే విషయం వేలం ద్వారా తెలియనుంది.

అలా.. అయితే ఇలా!

స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఉంటాయా?.. నిబంధనలకు విరుద్ధమంటూ రద్దు చేస్తారా?..ఒకవేళ రద్దు చేసిన పక్షంలో పాతవే కొనసాగుతాయా?.. అవే కొనసాగితే గత రిజర్వేషన్ల స్థానాలు మారుతాయా?.. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ పరంగా అమలు చేస్తుందా?.. మిగతా పార్టీలు ఎలా స్పందిస్తాయి?

..ఇలా స్థానిక ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 42 శాతానికి బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి నేడు హైకోర్టులో విచారణ జరగనుండగా.. ఆశావహులు ఎవరికి వారు ఊహాగానాల్లో మునిగిపోయారు. ఎన్నికలకు కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన పక్షంలో అనుకూల రిజర్వేషన్లు వచ్చిన వారు పోరు సన్నాహాలు మొదలు పెట్టేందుకు సిద్ధం అవుతుండగా.. అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చిన వారు మారుతాయనే ఆశతో ఉన్నారు. ఏదేమైనా ఆయా వర్గాలకు చెందిన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు పరిస్థితులకు అనుగుణంగా రెండు రకాల ప్రణాళికలను బేరీజు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ల అంశం హాట్‌టాపిక్‌గా మారింది.

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

'స్థానిక' ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ

- బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ
- ఎవరికి వారు ఊహాగానాలు
- రద్దయితే పాతవాటి ప్రకారం సన్నాహాలు
- పార్టీ పరంగా ముందుకెళ్తే ఆచితూచి అడుగులు



అందరిదీ బీసీ ఎజెండానే..

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ రూపొందించుకున్న వ్యూహాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే బీసీ మంత్రం అందుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీసీ రిజర్వేషన్లను ఎవరూ వ్యతిరేకిస్తలేరని.. తామూ సిద్ధమని.. అయితే చట్టబద్ధత అవసరమని ప్రతిపక్షాలు సైతం తమ అభిప్రాయాలను వెల్లడించాయి. ఈ మేరకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు బీసీ వాదమే ఎజెండాగా రానున్న స్థానిక ఎన్నికల్లో తలపడనున్నట్లు పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

రేపు నోటిఫికేషన్.. నామినేషన్లకు సిద్ధం..

బీసీ రిజర్వేషన్ల అంశంపై బుధవారం హైకోర్టులో విచారణ జరగనుండగా.. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ మేరకు గురువారం ఆయా జిల్లాలో జిల్లా ఎన్నికల ప్రధానాధికారులు తొలి విడతకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌కు రంగం సిద్ధం చేశారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా.. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కాంగ్రెస్.. దేనికైనా సిద్ధమంటూ..

బీసీ రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ.. అధికార కాంగ్రెస్ పక్కా వ్యూహంతో ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన పలు చోట్ల బీసీ వర్గాలకు చెందిన వారు రాజకీయాల్లో కీలకంగా లేరు. ఈ క్రమంలో బీసీల్లో సామాజిక వర్గాల వారీగా అధిక ఓట్లు ఉన్న వర్గానికి చెందిన నాయకులను ఆయా ప్రాంతాల్లో బరిలో నిలిపేలా సన్నాహాలు ప్రారంభించింది. ఒకవేళ రాజ్యాంగం ప్రకారం మొత్తంగా 50 శాతం కంటే ఎక్కువగా రిజర్వేషన్లు కేటాయించొద్దు.. జీఓ ప్రకారం రిజర్వేషన్ల కేటాయింపు చెల్లదని హైకోర్టు తీర్పు ఇచ్చిన పక్షంలోనూ పార్టీ పరంగా రిజర్వేషన్ల అమలుకు సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. అంతేకాదు ఇందుకనుగుణంగా అభ్యర్థుల ఎంపిక చేపట్టాలని జిల్లాల స్థాయిలో నాయకులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం ఖరారు చేసిన బీసీ స్థానాలను పరిగణనలోకి తీసుకుని.. అభ్యర్థులను ఖరారు చేసేలా జిల్లా నేతలు ఆచితూచి ముందుకు సాగుతున్నారు. ఆయా చోట్ల అన్‌రిజర్వ్‌డ్/జనరల్, అన్ రిజర్వ్‌డ్ మహిళ వచ్చినా.. బీసీ అభ్యర్థులను బరిలో నిలబెట్టనున్నట్లు తెలుస్తోంది.

పార్టీలపరంగానైనా 40 శాతం అవకాశం..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 2019లో జరిగిన స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటింది. ప్రధానంగా కారు, కాంగ్రెస్ మధ్యనే పోరు కొనసాగగా.. బీజేపీ అంతంత మాత్రంగానే ప్రభావం చూపించింది. అయితే ఈసారి మూడు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అన్ని పార్టీలు బీసీ నినాదామే ఎజెండాగా ముందుకెళ్తున్న క్రమంలో హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన పక్షంలో 42 శాతం బీసీలకు టికెట్లు దక్కనున్నాయి. లేనిపక్షంలో పార్టీల పరంగా అమలు చేస్తే వెనుకబడిన వర్గాలకు 40 శాతమైనా ప్రాతినిధ్యం దక్కే అవకాశం ఉన్నట్లు బీసీ మేధావులు అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ బీసీలు గెలిచారని.. మొత్తంగా సర్పంచ్ ఎన్నికల్లో 38 శాతం, ఎంపీటీసీ ఎన్నికల్లో 43 శాతం వెనుకబడిన వర్గాలకు చెందిన అభ్యర్థులు విజయం సాధించారని ఉదహరిస్తున్నారు. అయితే ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో బీసీలకు తగిన అవకాశం దక్కలేదని వివరిస్తున్నారు. గత ఎన్నికల్లో మొత్తం 71 జెడ్పీటీసీ స్థానాల్లో 20 బీసీలకు రిజర్వ్ కాగా.. మరో ఆరు జనరల్ స్థానాల్లోనూ గెలుపొందారని చెబుతున్నారు. ఈ లెక్కన 26 మంది బీసీలు జెడ్పీటీసీలుగా ఎన్నిక కాగా.. 42 శాతం రిజర్వేషన్లు అమలైతే 32 స్థానాలు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీకి 'పండుగే'!

దసరా నేపథ్యంలో మహబూబ్‌నగర్ రీజియన్‌కు రూ.33.64 కోట్ల ఆదాయం



ఆర్టీసీకి దసరా పండుగ కలిసొచ్చింది. జీవనోపాధి కోసం పట్టణానికి వెళ్లిన వేలాది కుటుంబాలు పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు చేరుకున్నారు. ఆనందోత్సాహాలతో వేడుకలు నిర్వహించుకొని తిరిగి వెళ్లిపోయారు.ఈక్రమంలో వారికి ఏ ఇబ్బంది లేకుండా ఆర్టీసీ ప్రత్యేక అదనపు సర్వీసులు నడిపింది. ఉత్తమ సర్వీసులతో ప్రయాణికుల మన్ననలు పొందడంతో పాటు.. రూ.కోట్లలో ఆదాయం ఆర్జించింది మహబూబ్‌నగర్ రీజియన్. ఆక్యుపెన్సీ రేషియోలోనూ రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది.

- స్టేషన్ మహబూబ్‌నగర్

- ఆక్యుపెన్సీ రేషియోలో రాష్ట్రంలోనే మొదటిస్థానం
- పండుగ రోజుల్లో ప్రయాణికుల కోసం ప్రత్యేక అదనపు సర్వీసులు
- 63లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన వైనం

దసరా పండుగ రోజుల్లో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చింది. పండుగ వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్‌లోని డిపోల నుంచి అదనపు బస్సు సర్వీసులను నడిపారు. ముఖ్యంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్ రూట్‌లో ఎక్కువ బస్సులను నడిపించారు. ఈ రూట్‌లోనే మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు అధిక ఆదాయం వచ్చింది. సెప్టెంబర్ 20వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు రూ.33కోట్ల 64లక్షల 90వేల ఆదాయం సమకూరింది. 53,07,651 కిలోమీటర్లు బస్సులు తిరగగా 63,19,755 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. గతేడాది కంటే ఈ ఏడాది బస్సులు 8 లక్షల కిలోమీటర్లు అధికంగా తిరిగి రూ.4 కోట్ల అధిక ఆదాయాన్ని పొందింది. ఆయా రోజుల్లో రాష్ట్రస్థాయిలో మహబూబ్‌నగర్ రీజియన్ 104 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించి మొదటి స్థానంలో నిలవడం విశేషం. ఇటీవల రాఖీ పండుగ రోజుల్లో కూడా మహబూబ్‌నగర్ రీజియన్‌లో ఓఆర్‌లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది.

సమష్టి కృషితోనే..



అన్ని డిపోల డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులు సమష్టి కృషి అంకితభావంతో పనిచేయడం వల్ల ఆక్యుపెన్సీ రేషియోలో 104 శాతం సాధించి రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ రీజియన్ మొదటిస్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. దసరా పండుగ రోజుల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్టాండ్లలో పర్యవేక్షణ నిర్వహించాం. ఆర్టీసీ పట్ల ఆదరణ చూపించిన ఉమ్మడి జిల్లాలోని ప్రయాణికులకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– పి.సంతోష్‌కుమార్, రీజినల్ మేనేజర్



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో దసరా పండుగ రోజుల్లో ప్రయాణికుల సందడి (ఫైల్)

పండుగ రోజుల్లో ఓఆర్, ఆదాయ వివరాలిలా.. (రూ.లలో)

డిపో	కిలోమీటర్లు	ఆదాయం	ఓఆర్
మహబూబ్‌నగర్	8,22,745	5,24,59,065	102
వనపర్తి	7,06,214	4,52,66,589	107
కల్వకుర్తి	5,97,226	3,72,16,886	105
గద్వాల	6,47,449	3,71,80,465	98
నారాయణపేట	5,40,242	3,41,67,487	100
షాద్‌నగర్	4,95,802	3,36,15,058	108
అచ్చంపేట	5,05,964	3,30,60,628	105
నాగర్‌కర్నూల్	4,85,444	3,23,82,076	111
కొల్లాపూర్	4,10,145	2,54,44,784	101
కోస్గి	96,420	56,970,38	105

పొరపాట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్థానిక సంస్థ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో అధికారుల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. ఈసీ నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు, మార్గ దర్శకాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏమైనా సందేహాలు ఉంటే శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ బాలుయాదవ్ ఎన్నికల నిర్వహణ, ప్రిసైడింగ్ అధికారుల విధులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ పార్థసారధి ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోషణ్ మాసోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీవరకు నిర్వహించే పోషణ్ మాసోత్సవం పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కలెక్టర్ విజయేందిర బోయి ఆవిష్కరించారు. పోషణ మాసం కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. క్యాక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జరినా బేగం, డీఎంహెచ్‌ఓ పద్మజా, డీపీఓ పార్థసారధి, బీసీ సంక్షేమాదికారి ఇందిర, బాలుయాదవ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అధికారులు

ఉదండాపూర్ నిర్వాసితులకు వసతులు కల్పించాలి

ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించే ప్లాట్ల పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూర్, ఉదండాపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్టతండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కింద 300 గజాల స్థలం కేటాయించాలన్నారు. అలాగే నిర్వాసితుల అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అంగన్‌వాడీకేంద్రాలు, పశువైద్యశాల, కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనం, పార్కులను రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ ఓవర్ హెడ్ ట్యాంక్, మిషన్‌భగీరథ పైపులు వంటి మౌలిక సదుపాయాలను త్వగా కల్పించాలన్నారు. పనులు వేగవంతం చేసి నవంబర్ చివరి వరకు ప్లాట్లను కేటాయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్‌డీఓ నవీన్, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్, మిషన్ భగీరథ ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లపై ఎన్నికల ఎఫెక్ట్

- పెద్దగా ఆసక్తి చూపని వ్యాపారులు
- ఉమ్మడి జిల్లాలో 227 దుకాణాలకు 40 టెండర్లు మాత్రమే దాఖలు



మహబూబ్‌నగర్ క్రైం: మద్యం దుకాణాల టెండర్లపై స్థానిక ఎన్నికల ప్రభావం అధికంగా పడుతుందనే చర్చ సాగుతోంది. మరోవైపు దరఖాస్తు ఫీజు సైతం రూ.3 లక్షలకు పెంచడంతో వ్యాపారులు దరఖాస్తు చేసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా చాలా మంది స్థానిక ఎన్నికల్లో ఖర్చు పెట్టాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో మద్యం దుకాణాల టెండర్లు వేద్దామా.. లేక ఎన్నికల బరిలో ఉందామా అనే ఆలోచనలో తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో టెండర్ల ప్రక్రియ మొదలైన మొదటివారం నుంచే దరఖాస్తుల హడావుడి కనిపించేది. కానీ ఈసారి ఊహించిన స్థాయిలో కనిపించడం లేదు. ఇంకా దరఖాస్తు చేసుకోవడానికి 11 రోజుల వ్యవధి ఉన్న క్రమంలో చివరి వారం రోజుల్లో వేగం పుంజుకుంటుందా.. లేక ఇలాగే ఉంటుందోనని ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే చివరి నాలుగు రోజుల్లో భారీగా టెండర్లు రావొచ్చనే ధీమాలో ఎక్సైజ్ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోతే ప్రభుత్వం గడువు పొడిగించే అవకాశం లేకపోలేదు. కాగా.. ఉమ్మడి జిల్లాలో మంగళవారం 13 టెండర్లు దాఖలయ్యాయి. వీటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో 7, నారాయణపేటలో 3, నాగర్‌కర్నూల్ జిల్లాలో 3 దరఖాస్తులు ఉన్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 40 టెండర్లు మాత్రమే దాఖలు కావడం విశేషం. మద్యం అమ్మకాలు గణనీయంగా ఉండే జోగుళాంబ గద్వాల జిల్లాలో వ్యాపారులు టెండర్లు వేయడానికి ముందుకు రాలేదు. అదేవిధంగా వనపర్తి జిల్లాలో సైతం అదే పరిస్థితి కనిపిస్తోంది.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే సీనియర్ విభాగం జాతీయస్థాయి యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు మంగళవారం తెలిపారు. 18– 21 సంవత్సరాల విభాగంలో నందిని, కావేరి, 21–25 విభాగంలో స్వప్న, సాగర్, ఆకాశ్, 25–35 విభాగంలో బాలమణి, 35–45 విభాగంలో వెంకటేష్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మన్యంకొండలో వైభవంగా కల్యాణోత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణ వేడుకను నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను మళ్లీ పల్లకిలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రకరకాల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామి దంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి పాల్గొన్నారు.



అలంకరణలో స్వామివారు

క్లుప్తంగా

కోనేరులో పడి యువకుడి మృతి

జడ్చర్ల: వెంకటేశ్వరస్వామి ఆలయంలోని శిథిలావస్థలో ఉన్న కోనేరులో పడి యువకుడు మృతి చెందాడు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలు.. స్థానిక వెంకటేశ్వర కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్(25) సోమవారం మధ్యాహ్నం కోనేరులో చేతులు కడుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది కోనేరులో గాలించినా ఫలితం లేకపోయింది. మంగళవారం నీటిలో మృతదేహం తేలడంతో బయటకు తీశారు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాల్వలో గుర్తు తెలియని శవం లభ్యం



మరికల్: కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మండల కేంద్ర శివారులో చోటు చేసుకుంది. సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మంగళవారం కాల్వలో మృతదేహం తేలియాడుతుండగా గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచాయతీ కార్మికులతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య



పార్వతమ్మ(ఫైల్)

తాడూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పాపగల్‌లో మంగళవారం చోటుచేసు కుంది. హెడ్‌కానిస్టేబుల్ శేఖర్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం ఇంటినుంచి ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. చివరికి మంగళవారం గ్రామానికి చెందిన రాంచంద్రారెడ్డి బావిలో శవమై తేలింది. గమనించిన పశువుల కాపర్లు విషయాన్ని తెలియజేయగా కుటుంబ సభ్యులు బావిదగ్గరకు వెళ్లి విషయాన్ని పోలిసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పార్వతమ్మ మృతదేహంగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి భర్త రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.

కనిపించకుండా పోయి.. శవమై తేలాడు

గోపాల్‌పేట: రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయిన యువకుడు పాలమూరు రంగారెడ్డి కాల్వలో శవమై తేలిన ఘటన రేవల్లిలో మంగళవారం వెలుగు చూసింది. రేవల్లి ఎస్‌ఐ రజిత కథనం ప్రకారం.. రేవల్లికి చెందిన సాబేరాబేగం, అబ్దుల్ ఉస్సేన్ భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమారులు. కొన్నేళ్ల క్రితం అబ్దుల్ ఉస్సేన్ భార్యాపిల్లలను వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుమారుడు సలీంపాషా (33) ఆదివారం ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం రేవల్లి శివారులో ఉన్న పాలమూరు రంగారెడ్డి పెద్దకాల్వలో శవం తేలుతూ కనిపించగా.. బ్రిడ్జి పై నుంచి చూసిన కొందరు రేవల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కాల్వ వద్దకు చేరుకొని మృతదేహం సలీంపాషాగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. సలీంపాషా సోదరుడు జహంగీర్ ఫి ర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తెలకపల్లి: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కమ్మరెడ్డిపల్లికి చెందిన యాలాల మల్లయ్య(45) మంగళవారం ఉద యం తన ఇంటి ముందు ఉన్న వరికోత మిషన్‌కు టవల్‌తో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్లయ్య భార్య సునీత కుమారుడితో 15 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. ఈ క్రమంలో మల్లయ్య మద్యానికి బానిసైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి అన్న యాలాల కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

తెలకపల్లి: పురుగుల తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకు న్న సంఘటన చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని గోలగుండం గ్రామానికి చెందిన ఎ త్తం రాములు(40) కొంత కాలంగా మద్యానికి బా నిసై ఈ నెల 5న భార్యతో గొడవ పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం 11గంటలకు పురుగుల మందు తాగాడు. గమనించి కుటుంబ సభ్యులు జిల్లా ఏరియా అస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతని భార్య ఎత్తం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘరానా దొంగ అరెస్ట్

- 43 గ్రాముల బంగారం, 7 కిలోల వెండి ఆభరణాలు, నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి



వివరాలు వెల్లడిస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరులో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఘరాన దొంగను పోలీసులు ఎట్టకేలకు మంగళవారం పట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి పూర్తి వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో నివాసం ఉండే నాగేశ్వర్‌రెడ్డి కుటుంబంతో కలిసి సెప్టెంబర్ 28న తిరుపతికి వెళ్లారు. సెప్టెంబర్ 29న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారు. 30వ తేదీన ఉదయం ఇల్లు శుభ్రం చేయడానికి వచ్చిన పని మనిషి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో వెంటనే నాగేశ్వర్‌రెడ్డికి సమాచారం ఇచ్చింది. ఆయన వెంటనే తన అన్న రాజేశ్వర్‌రెడ్డికి విషయం తెలుపగా వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న నాలుగు కిలోల వెండి ఆభరణాలు, రూ.20 నగదు అపహరించినట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం ఉదయం ట్యాంక్‌బండ్‌పై చేసిన తనిఖీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన ఎండీ మహబూబ్‌పాషా అలియాస్ బిర్యానీ పాషా పట్టుబడ్డాడు. అతడిని విచారించగా గణేష్‌నగర్‌తో పాటు మరో పది దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. నేరస్తుడు ఎండీ మహబూబ్ పాషా కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండటంతో పాటు తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిపై వన్‌టౌన్‌లో ఒకటి, టూటౌన్‌లో రెండు, రూరల్‌లో ఐదు, దేవరకద్ర పోలీస్ స్టేషన్‌లో రెండు దొంగతనం కేసులు నమోదైనట్లు వెల్లడించారు. మహబూబ్‌పాషా నుంచి రూ.43 గ్రాముల బంగారం, 7 కిలోల వెండి ఆభరణాలు, రూ.26,660 నగదు, కారు, సెల్‌ఫోన్ రికవరీ చేసినట్లు తెలిపారు. కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ చెప్పారు. కేసును ఐటీ సెల్ అధికారులతో పాటు సీసీఎస్, వన్‌టౌన్ పోలీసులు సమన్వయంతో ఛేదించారని ఎస్పీ తెలుపడంతో పాటు అభినందించారు. సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, సీసీఎస్ సీఐ రత్నం, ఎస్‌ఐ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న చిరకాల స్వప్నం

- జడ్చర్లకు బైపాస్ డీపీఆర్‌కు రంగం సిద్ధం
- 4 లైన్లుగా 167జాతీయ రహదారికి కూడా..
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి నుంచి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి లేఖ



నితిన్‌గడ్కరీకి వివరిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

జడ్చర్ల: జడ్చర్ల ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేరేందుకు బీజం పడింది. జడ్చర్లలో ట్రాఫిక్ దిగ్బంధనం ఛేదించేందుకు పట్టణం చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదనల అడుగులు ముందుకు కదిలాయి. ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరి రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా ఎంపీ డీకే అరుణతోపాటు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కలిసి జడ్చర్ల బైపాస్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో సానుకలంగా స్పందించిన కేంద్రమంత్రి నుంచి తమకు ఓ లేఖ అందిందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం తమకు వచ్చిన లేఖను విడుదల చేశారు. జడ్చర్ల చుట్టూ, ఓవైపు 44వ నంబర్ జాతీయ రహదారి మరోవైపు 167వ నంబర్ జాతీయ రహదారి ఉండడంతో ఆయా రహదారులను కలిపి జడ్చర్ల పట్టణం చుట్టూ బైపాస్ రోడ్డును నిర్మించే విధంగా డీపీఆర్(డిటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్టు) రూపొందించడానికి కన్సల్టెన్సీని ఏర్పాటు చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా జడ్చర్ల మీదుగా వెళ్తున్న 167 నంబర్ జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించేందుకు డీపీఆర్‌ను తయారు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 2025–26 వార్షిక ప్రణాళికను రూపొందించి నిధులు మంజూరు చేసేవిధంగా కృషిచేస్తామన్నారు. రెండు జాతీయ రహదారుల ట్రాఫిక్‌తో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్ల చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదనలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందించడంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎంపీ డీకే అరుణ తదితరులు ఇందుకు సహకరిస్తున్నారని కొనియాడారు. బైపాస్ రోడ్డుతోపాటు నాలుగు లైన్ల జాతీయ రహదారి విస్తరణతో జడ్చర్ల ముఖచిత్రం మారిపోతుందన్నారు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో



శ్రీశైలంలో ఆరు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

- 1.33లక్షల క్యూసెక్కుల వరద
- 11 గేట్లు ఎత్తివేత
- శ్రీశైలానికి 1.12 లక్షల క్యూసెక్కులు విడుదల

గద్వాల/ఆత్మకూర్: జూరాలకు ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన వర్షాలకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. మంగళవారం జూరాలకు 1.33 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. ప్రాజెక్టు 11 గేట్లు ఎత్తి 1.12 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 37,206 క్యూసెక్కుల నిటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.83 టీఎంసీల నిల్వ ఉంది. అదేవిధంగా సాగునీటి ప్రాజెక్టులైన నెట్టెంపాడు, భీమా లిఫ్ట్–1, 2, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, సమాంతర కాల్వలకు నీటిని పూర్తిగా నిలిపివేశారు. జూరాల ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జోరుగా విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో మంగళవారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపడుతున్నారు.

శ్రీశైలం ఆరు గేట్లు ఎత్తివేత

దోమలపెంట: జూరాలలో ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 77,462, విద్యుదుత్పత్తి చేస్తూ 37,206, సుంకేసుల నుంచి 8,892, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,23,810 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలంలో ఆనకట్ట వద్ద ఆరు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1.68 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 30,325 మొత్తం 65,640 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.9 అడుగుల వద్ద 215.3263 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5 వేలు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,830, ఎంజీకేఎల్‌ఐకు 642 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.107 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 14.350 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టారు.

11న పీయూలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 11న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని.. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వీసీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అడ్మినిస్ట్రేషన్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో బల్క్ డ్రగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ఫార్మా కంపెనీల్లో ఖాళీల భర్తీకి డ్రైవ్ చేపడుతున్నామని.. 2021 నుంచి 2025 విద్యాసంవత్సరం వరకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, మైక్రో బయోలజీ, బీ–ఫార్మసీ, ఎం–ఫార్మ, బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, బీఎస్సీ కెమిస్ట్రీతో పాటు ఇంటర్మీడియట్, ఐటీఐ పూర్తి చేసిన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పేర్లను గూగుల్ ఫాంలో నమోదు చేసుకోవాలని, ఇప్పటికే 200కు పైగా యువత తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్ (సెల్‌నంబర్ 98494 45877) సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పీఆర్వో గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్, కోచ్‌గా జిల్లావాసులు



మేనేజర్‌గా శరత్‌చంద్ర



కోచ్‌గా సునీల్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కలింగ స్టేడియంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న 40వ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ బాలుర అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర, కోచ్‌గా సునీల్‌కుమార్ ఎంపికయ్యారు. వీరు జట్టు క్రీడాకారులతో కలిసి బుధవారం భువనేశ్వర్ వెళ్లనున్నారు. వీరి ఎంపికపై జిల్లా అథ్లెటిక్స్ సంఘం, సీనియర్ అథ్లెట్లు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ రిమాండ్

గద్వాల క్రైం: దళిత యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మోసం చేసి, ఆమె మృతికి కారకుడైన కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడ్‌ను మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. కొత్తగూడెం పాల్వంచకు చెందిన దళిత యువతి కోలెటి ప్రియాంక (32), జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లికి చెందిన రఘునాథ్‌గౌడ్ ప్రేమించుకున్నారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం శిక్షణ కేంద్రంలో ఇద్దరికి పరిచయం ఏర్పడి, ప్రేమగా మారిందన్నారు. ఈ క్రమంలో రఘునాథ్‌గౌడ్ పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం పొందాడు. దీంతో ప్రియాంక తనను వివాహం చేసుకోవాల్సిందిగా రెండు నెలల క్రితం రఘునాథ్‌గౌడ్, వారి కుటుంబ సభ్యులను కోరగా.. వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ప్రియాంక మాత్రం తనను పెళ్లి చేసుకోవాల్సిందేనని ఒత్తిడి తీసుకొచ్చి చిన్నోనిపల్లిలో వారి ఇంట్లోనే ఉంటుంది. రెండు నెలలు అయినప్పటికీ రఘునాథ్‌గౌడ్, వారి కుటుంబ సభ్యుల వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన యువతి ఈ నెల 4న విషం గుళికలను తీసుకొని, గద్వాల జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. యువతి మృతికి కారకులైన కానిస్టేబుల్, వారి కుటుంబ సభ్యులపై గట్టు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో భాగంగా ఏ–1 రఘునాథ్‌గౌడ్‌ను పోలీసుశాఖ సర్వీస్ నుంచి తొలిగించిందన్నారు. మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని అలంపూర్ కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. త్వరలో మరి కొందరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. వారందరిపై ఎస్సీ, ఎస్టీ తదితర బీఎన్‌ఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేశామని డీఎస్పీ పేర్కొన్నారు.

సరళాసాగర్‌ను సందర్శించిన ఢిల్లీ బృందం



సరళాసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర జలవనరుల శాఖ అధికారులు

మదనాపురం: ప్రసిద్ధ సరళాసాగర్ ప్రాజెక్టును మంగళవారం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర జలవనరుల శాఖ అధికారుల బృందం సందర్శించింది. ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యం, ప్రస్తుతం కొనసాగుతున్న లీకేజీలు, ఉడ్ సైఫన్ భాగంలో నీటి లీకేజీలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమీక్షించారు. ప్రాజెక్టు చుట్టుపక్కల ప్రాంతాన్ని పరిశీలించింది. లీకేజీల నివారణకు అవసరమైన మార్గాలను చర్చించారు. ప్రాజెక్టు ఉడ్ సైఫన్ భాగం, గ్రావిటీ డ్యాంపై ప్రత్యేక దృష్టి సారించి నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డ్యామ్ సేఫ్టీ నిపుణులు అశోక్ కుమార్ గంజూ, రిటైర్డ్ ఇంజినీర్ చీఫ్ డాక్టర్ పి.రామరాజు, చీఫ్ ఇంజినీర్ టి.ప్రమీల, సీనియర్ ఇంజినీర్ చంద్రశేఖర్‌తోపాటు జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసి ముద్దయిన మొక్కజొన్న



వరదలో కొట్టుకుపోతున్న మొక్కజొన్నను ఎత్తుకుంటున్న రైతులు

- బాదేపల్లి యార్డులో తడిసిన మొక్కజొన్న
- ఆలస్యంగా టెండర్లు దాఖలు



తడిసిన మొక్కజొన్నను కుప్పగడుతున్న రైతులు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ఆకస్మికంగా కురిసిన వర్షానికి యార్డు ఆవరణలో ఆరబోసిన మొక్కజొన్న తడిసి ముద్దయ్యింది. వర్షం నీరు ఉధృతంగా దిగువకు ప్రవహించడంతో ఆరబోసిన మొక్కజొన్న కొట్టుకుపోయింది. అయితే కొందరు రైతులు మొక్కజొన్నను షెడ్లలోనే ఆరబోయడంతో వర్షం ముప్పు తప్పింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఓ వ్యాపారి మొక్కజొన్న కూడా వర్షానికి కొట్టుకుపోయింది. యార్డు ఆవరణలో సీసీ ఉండడంతో.. ఆరబోసిన మొక్కజొన్నను కుప్పగట్టేందుకు కూడా సమయం దొరకనంత వేగంగా వ రద దిగువకు ప్రవహిస్తుందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మార్కెట్‌లో షెడ్ల నిర్మాణాలు చేపట్టి వర్షం ముప్పు నుంచి ధాన్యం కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏజెంట్లు, వ్యాపారుల మధ్య వాగ్వాదం

బాదేపల్లి యార్డులో మంగళవారం వ్యాపారులు ఆలస్యంగా టెండర్లు దాఖలు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులకు మధ్య విభేదాలు తలెత్తడంతో టెండర్లు నిలిపివేయడంతో గందరగోళం చోటు చేసుకుంది. కమీషన్ ఏజెంట్ల ద్వారా పంట దిగుబడులను కొనుగోలు చేసిన వ్యాపారులు 20 రోజుల వ్యవధిలో అందుకు సంబంధించిన డబ్బులను ఏజెంట్లకు ఇవ్వాల్సి ఉంటుంది. 20 రోజుల గడువు ముగిసిన తరువాత రూ.1.50 వడ్డీతో మొత్తాన్ని ఇవ్వాల్సి ఉంటుందన్న నిబంధనలు ఉన్నాయి. అయితే తాము బయట రూ.3 వడ్డీకి తెచ్చి రైతులకు డబ్బులు సర్దుబాటు చేస్తున్నామని, వ్యాపారులు కూడా తమకు రూ.3 వడ్డీ చొప్పున చెల్లించాలని డిమాండ్ చేయడంతో వివాదం నెలకొంది. దీంతో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జ్యోతి జోక్యం చేసుకుని సమస్యలపై తరువాత చర్చిద్దామని, ప్రస్తుతానికి రైతులకు ఇబ్బందులు కలుగనీయకుండా టెండర్లు వేయాలని నచ్చజెప్పడంతో తాత్కాలికంగా సమస్య సద్దుమనిగింది.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,057

బాదేపల్లి మార్కెట్‌లో మంగళవారం 1,772 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,057, కనిష్ఠంగా రూ.1,601 ధరలు లభించాయి. అదేవిధంగా ఆముద క్వింటాల్‌కు రూ.5,020, వేరుశనగకు గరిష్ఠంగా రూ.4609, కనిష్ఠంగా రూ.3356 ధరలు పలికాయి.

గంజాయి విక్రేతల అరెస్టు



జడ్చర్ల: గంజాయిని చిన్న చిన్న పాకెట్లుగా చేసి గుట్టుగా విక్రయిస్తున్న ముగ్గురు విక్రేతలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. బాలానగర్ మండల పరిధి లోని గుండెడు– ఉడిత్యాల రహదారిలోని కిరా ణ దుకాణంలో నిర్వహించిన తనిఖీలో 1.20 కేజీల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. విక్రే తలు వి.కిషన్, నేనావత్ కృష్ణా, నేనావత్ లాలి ను అరెస్ట్ చేశామన్నారు. హైదరాబాద్ నుంచి ఎండు గంజాయిని రూ.15 వేలకు కేజీ చొప్పు న కొనుగోలు చేసి ఆరు గ్రాముల పాకెట్లను తయారు చేసి ఒక్కో పాకెట్‌ను రూ. 400కు కా ర్మికులకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయితో పాటు, రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడు ల్లో ఎస్‌ఐలు కార్తీక్‌రెడ్డి, నాగరాజు, సిబ్బంది సిద్దార్థ, స్నేహలత, సునీత పాల్గొన్నారు.

వీకేర్ సీడ్స్ కంపెనీపై ఐటీ దాడులు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న వీకేర్ సీడ్స్ కంపెనీపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆదాయ పన్నులశాఖ (ఐటీ) అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మొత్తం 6 కార్లలో 22మంది అధికారులు తెల్లవారుజామునే సదరు కంపెనీకి చేరుకున్నారు. కంపెనీలో పనిచేసే ఉద్యోగులను ఉదయం 6గంటలకే విధులకు హాజరుపరిచారు. కంపెనీలో పలు డాక్యుమెంట్లు తనిఖీ చేసినట్లు సమాచారం. అదే విధంగా కంపెనీ యజమానులు వెంకట్రావు, కోటిస్వామి, కిరణ్, రాజశేఖరప్ప, బాబయ్య ఇళ్లల్లో సైతం ఐటీ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిసింది.



రాష్ట్రస్థాయిలో జిల్లాపేరు నిలబెట్టాలి



రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్–19 బాలికల ఫుట్‌బాల్ జట్టు

జడ్చర్ల టౌన్: అండర్–19 ఫుట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి టోర్నీలో రాణించి జిల్లాపేరు నిలబెట్టాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మినీ స్టేడియం మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 10 నుంచి 12వరకు సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనేందుకు ఎంపికైన 18మందిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శారదభాయి, పీడీ, పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు వడెన్న, కృష్ణయ్య, పీడీలు భానుకిరణ్, మోయిన్, జ్యోతి పాల్గొన్నారు.

రూ.9.77 లక్షలు కాజేశారు

పాన్‌గల్: సైబర్ క్రైమ్ మోసంలో మండలంలో ఓ మహిళ తన బ్యాంకు ఖాతా నుంచి రూ.9,76,995 నగదును పోగొట్టుకున్న ఘటనపై మంగళవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండపల్లికి చెందిన కొమారి సరితకు పాన్‌గల్ ఎస్‌బీఐలో ఖాతా ఉంది. ఏప్రిల్ 20, 2024న ఆమె మొబైల్ వాట్సాప్‌కు ఒక లింక్ వస్తే దానిని ఓపెన్ చేసి లింక్ స్క్రీన్‌ను షేర్ చేసింది. దీంతో ఫోన్‌పే ద్వారా ఆమె తెలియకుండానే ఏప్రిల్ 20 నుంచి అక్టోబర్ 4, 2024 వరకు ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.3 వేలు, రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.9,76,995 వరకు డ్రా అయ్యాయి. ఘటనపై ఎస్‌బీఐ కస్టమర్ కేర్, బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తన బ్యాంకు ఖాతా నుంచి నగదును డ్రా చేసిన సైబర్ నేరగాళ్లపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కొమారి సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ మోసంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మసీద్‌లో చోరీ

చిన్నంబావి: మండలంలోని బెక్కం గ్రామంలోని మసీద్‌లో 14 కేజీల వెండి అభరణాలు చోరీకి గురైన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగన్మోహన్ చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని బెక్కం గ్రామంలోని పీర్ల మసీద్ తాళాలు పగులగొట్టి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన స్వీపర్ మసీద్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లగా.. మసీద్‌లో పీర్ల సామగ్రి లేకపోవడంతో గమనించిన ఆమె వెంటనే గ్రామస్థులకు విషయం తెలిపింది. వారు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్‌ఐ ఘటన స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. చోరీపై కేసు నమోదు చేసి అనుమానితులను విచారిస్తున్నామన్నారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ కృష్ణ పరిశీలించారు.